క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ప్రతాప్ ప్రచారం

నూజివీడు: వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గురువారం ఆగిరిపల్లి మండలం నెక్కలంగొల్లగూడెం, అడవినెక్కలం, కనసాన పల్లిలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు బుధవారం తెలిపాయి. సాయంత్రం 5 గంటల నుంచి ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, సానుభూతిపరులు తరలిరావాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు విజ్ఞప్తి చేశాయి.

కొండపల్లిలో సర్నాల సుడిగాలి పర్యటన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు బుధవారం కొండపల్లిలో సుడిగాలి పర్యటన చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు అబ్దుల్‌పాషా, పలువురు వైద్యులు, పట్టణ ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిశారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చాలని వారిని కోరారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా ఎంపీ కేశినేని నాని, నన్ను ఆదరించి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం వివిధ ఆలయాలు, చలువ పందిళ్ల వద్ద శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్, ఐటీసీ ఆనంద్, బుడే, నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ

ఇబ్రహీంపట్నం: శాంతివన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి మే 2వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షుడు, యోగా గురువు లంకే జనార్దన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌వీసీటీ కల్యాణ మండపంలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా యోగా శిక్షణ ఉంటుందన్నారు. సూర్య నమస్కారాలు, ఆసనాలు, సూక్ష్మ వ్యాయామాలు, ముద్రలు తదితరాలపై శిక్షణ ఉంటుందని వివరించారు.

మైలవరం వివేకానంద విద్యార్థుల ప్రతిభ

మైలవరం: నేషనల్ లెవెల్ సైన్స్ టాలెంట్ టెస్ట్, యూనిఫైడ్ ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో మైలవరం వివేకానంద హైస్కూల్ విద్యార్థులు 30 మంది ప్రతిభ కనబర్చి పతకాలు, సర్టిఫికెట్లు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనిఫైడ్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారు గత ఏడాది డిసెంబర్, 2024 జనవరిలో 4వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారని చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ పి. రాజారెడ్డి అభినందించారు.

ఇత్తడి కవచాలు, మకర తోరణాలు సమర్పణ



గంపలగూడెం: గంపలగూడెం భజన మందిరంలోని సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయ స్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్ విగ్రహాలకు స్థానిక వికాస తరంగిణి కమిటీ వారిచే ఐదు ఇత్తడి కవచాలు, రెండు మకర తోరణాలు అందజేశారు. అర్చకులు బాదంపూడి శివరామలింగప్రసాద్ వాటికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం దేవతామూర్తులకు అలంకరించారు. భజన మందిరం కమిటీ నిర్వాహకులు చారుగుండ్ల చిన్నహనుమంతరావు, వికాస తరంగిణి మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

తగిన జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ

విస్సన్నపేట: ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అగ్నిప్రమాదాలను నివారించవచ్చని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బి నానికా అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ఇండేన్ గ్యాస్ వద్ద సిబ్బందికి ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బి నానికా అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించి బ్రోచర్లు పంపిణీ చేశారు. అగ్నిమాపక సిబ్బం పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

చాట్రాయి: విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని జనార్దనవరం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం గురు, శుక్రవారాల్లో చిత్తపూరుకి కొండపర్వ, తుమ్మగూడెం సబ్‌స్టేషన్ నుంచి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తామని, అదేవిదంగా జనార్ధనవరం, ఆరుగొలనుపేట గ్రామాలకు చాట్రాయి సబ్‌స్టేషన్ నుంచి ఉదయం 9 గంటల నుంచి విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు.

చూసిన కనులదే భాగ్యం

- వాడవాడలా రాములోరి కల్యాణోత్సవం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలుచోట్ల అన్నసమారాధనలు



గంపలగూడెం రామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు



మైలవరంలో పూజలు నిర్వహించిన సర్నాల తిరుపతిరావు



తిరువూరు రామాలయంలో స్వామిదాసు పూజలు



ఆగిరిపల్లిలో ప్రత్యేక అలంకరణలో కోదండరాముడు



లోపూడి కోదండ రామాలయంలో కల్యాణ పూజలు

తిరువూరు: శ్రీరామ నవమి వేడుకలు తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో బుధవారం వాడవాడలా వైభవంగా నిర్వహించారు. ఆలయాలు, పలు కూడళ్లలో చలువ పందిళ్లు వేసి స్వామివార్లకు పూజలు చేశారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. సీతారాముల గుణగణాలను పండితులు వివరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించి తరించారు. తిరువూరులోని కోదండ రామాలయం, షిర్డీ సాయి మందిరం, రాజుపేట వీరాంజనేయ స్వామి ఆలయం, చీరాల సెంటర్‌లోని ఆంజనేయస్వామి మందిరం, పాటిమీద భక్తాంజనేయస్వామి దేవస్థానం, వేంకటాచల స్వామి ఆలయం, పాత తిరువూరు రామాలయం, పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం, చంద్రమౌళీశ్వరాలయం, రుక్మిణీకృష్ణ ఆర్యవైశ్య కల్యాణ మండపం, ఎస్‌ఆర్ టవర్స్ సెంటర్లలో సీతారామ కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి పానకం, వడపప్పు, ప్రసాదంగా పంపిణీ చేశారు. మండలంలోని మునుకుళ్ల, కోకిలంపాడు, లక్ష్మీపురం, కాకర్ల, రోలుపడి, చింతలపాడు, ముష్టికుంట్ల, వావిలాల, ఎర్రమాడు, పెద్దవరం, కొమ్మిరెడ్డిపల్లి, చిట్టేల, చౌటపల్లి, గానుగపాడు, ఆంజనేయపురం గ్రామాలలో శ్రీ రామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాసవీ క్లబ్ సభ్యులు భద్రాచలం సీతారామ కల్యాణోత్సవాల్లో పాల్గొని తిరిగి వెళ్లే ఆర్టీసీ ప్రయాణికులకు స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద మజ్జిగ, మంచినీరు అందజేశారు.

మైలవరంలో..

మైలవరం: శ్రీ రామ నవమి వేడుకలు మైలవరం మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాల్లో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి వార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పు అందజేశారు. మైలవరం నూజివీడు రోడ్డు, రామకృష్ణ కాలనీ, భద్రాచలం రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయాల వద్ద అన్నదానం చేశారు. మండలంలోని చంద్రాల, గణపవరం, పుల్లూరు, మొర్సుమల్లి, చంద్రగూడెం తదితర గ్రామాల్లో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి. మైలవరం నూజివీడు రోడ్డులోని రామాలయం, గణపవరంలోని రామాలయంలో వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు పూజలు నిర్వహించారు. తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని, తాను ఎమ్మెల్యేగా గెలవాలని కోరుకున్నట్లు తెలిపారు.

- **జి.కొండూరు:** మండల పరిధిలోని ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. మండల పరిధి వెల్లటూరు శివారు గ్రామాలైన బీమవరప్పాడు, సీతారాంపురం గ్రామాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణాన్ని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు తిలకించి పూజలు చేశారు. ఎమ్మెల్యేగా గెలుపొందాలని కాంక్షిస్తూ పురోహితులు తిరుపతిరావుని ఆశీర్వదించారు. ఎంపీపీ వేముల కొండ లక్ష్మీతిరుపతమ్మ, కేడీసీసీబీ డైరెక్టర్ గుమ్మడపు రవీంద్ర రాణా, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈతాకుల జగదీష్, మరియన్న పాల్గొన్నారు.

నల్లగట్ల స్వామిదాసు పూజలు..

తిరువూరు: తిరువూరు పట్టణంలోని పలు దేవాలయాల్లో బుధవారం జరిగిన శ్రీ రామ నవమి వేడుకల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు పాల్గొని పూజాదికాలు నిర్వహించారు. కోదండ రామాలయంలో జరిగిన సీతారామ కల్యాణంలో పాల్గొన్న స్వామిదాసుకు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

- **ఇబ్రహీంపట్నం:** మండలంలోని వివిధ గ్రామాల్లో రాములోరి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కొండపల్లి చెన్నకేశ రామాలయం, ఇబ్రహీంపట్నం సీతారామాలయంలో స్వామివార్ల కల్యాణం వైభవంగా జరిగింది. గరుడ వాహనంపై స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. కిలేశపురం సీతారామ ఆలయంలో ఆలయ ట్రస్టీ బత్తుల రమేష్ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తుల విగ్రహాలకు పలువురు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. భారీగా అన్నదానం చేశారు. కొటికలపూడి రామాలయం వద్ద స్వామి వారి కల్యాణం, చెన్నకేశవస్వామి ఆచారంతో పూజలు జరిపారు. కత్తులతో సేవ చేసి భక్తిని చాటుకున్నారు. అన్నదానంతో పాటు గ్రామోత్సవం నిర్వహించారు. కాచవరం సీతారామాలయం వద్ద కల్యాణం, విశేష పూజలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.
- **ఎ.కొండూరు:** చీమలపాడు, కృష్ణారావుపాలెం, రామచంద్రాపురం, ఎ.కొండూరు, కంభంపాడు, రేపూడి, పోలిశెట్టిపాడు గ్రామాల్లో బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామాలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. వడపప్పు, పానకాన్ని పంపిణీ చేశారు.
- **రెడ్డిగూడెం:** కొత్తరెడ్డిగూడెం గ్రామంలోని రామాలయం, రెడ్డిగూడెం ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు బుధవారం కల్యాణం నిర్వహించారు. రెడ్డిగూడెంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. మండలంలోని మద్దులపర్వ, కూనవరాజుపర్వ, బూరుగగూడెంలోని రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం అన్నదానం నిర్వహించారు.
- **విస్సన్నపేట:** మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని రామాలయం వద్ద స్వామి వారి కల్యాణం, అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న రామాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న రామాలయం, సత్తుపల్లి రోడ్డులోని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవం, అన్నసమారాధన నిర్వహించారు. వాడవాడలా సీతారాముల కల్యాణోత్సవాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం

నూజివీడు: స్థానిక పాతపేటలోని సూరిరామమందిరంలో, కొత్తపేటలోని సుతార్ల రామమందిరంలో, సిబ్బందిపేటలోని కోదండ రామాలయంలో, మైలవరం రోడ్డులోని ముసలి రామమందిరంలో, ట్రిపుల్ ఐటీ సమీపంలోని రామాలయంలో, పెద్ద గాంధీబొమ్మ సెంటరులోని సీతారామాలయంలో, కొప్పుల వెలమపేటలో, ఎంప్లాయీస్ కాలనీలో, సమతానగర్‌లో సీతారాముల కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. బొందిలీపేటలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలో గ్రామగ్రామాన స్వామివార్ల కల్యాణాలు జరిగాయి. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు.

ఎన్నెస్పీ కాలనీలో ..

పట్టణంలోని ఎన్నెస్పీ కాలనీలో ఈఈ కార్యాలయ ఆవరణలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అన్నసమారాధన నిర్వహించారు. నిర్వహణ కమిటీ కన్వీనర్ టి. శ్రీనివాస బాబు, ఎన్నెస్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- **చాట్రాయి:** చనుబండ శ్రీ కోదండ రామాలయంలో సీతారామ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు దాతల సహకారంలో బెల్లం పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులతో పాటు 25 మంది దంపతులు కల్యాణ పీటలపై కూర్చున్నారు. బూరుగుగూడెంలో ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి దంపతులు కల్యాణం నిర్వహించి రెండు వేల మందికి అన్నదానం చేశారు. నరశింహారావుపాలెం రామాలయంలో 2 వేల మందికి అన్నదానం చేశారు. చాట్రాయి కోదండ రామాలయంలో సీతారామ కల్యాణం నిర్వహించారు.
- **ఆగిరిపల్లి:** స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో సీతారామచంద్ర స్వామి వార్ల తిరు కల్యాణ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆగిరిపల్లికి చెందిన ముదిరాజ్ సంఘం వారు ఉభయ దాతలుగా వ్యవహరించగా ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణం జరిపించారు. ఐదు వేల మందికి అన్నదానం చేశారు. వట్టిగుడిపాడు సెంటర్ రామాలయంలో, నెక్కలం అడ్డరోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయం, శోభనాపురం రామాలయం, కొత్త ఈదర, సీతారాంపురం, నూగొండపల్లి రామాలయాల్లో కల్యాణోత్సవాలు జరిగాయి.

కమనీయం.. కల్యాణం

గంపలగూడెం: గంపలగూడెం సీతారామచంద్ర స్వామి ఆలయంలో అర్చకులు దేవయజనం శ్రీధరాచార్యులు, అర్చక బృందంచే స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. 67 మంది దంపతులు పీటలపై కూర్చుని కన్యాదానం చేశారు. వివాహ మహోత్సవంలో వివిధ ఘట్టాలు, వాటి ప్రాముఖ్యతను అర్చకులు వివరించారు. గంపలగూడెం భజన మందిరం, మేడూరు, పెనుగొలను, ఊటుకూరు, నెమలి, అనుముల్లంక రామాలయాలు, తోటమూల, ఆర్లపాడు, కొత్తపల్లి, గోసవీడు, సత్యాలపాడు, కొణిజెర్ల, చల్లగుండ్లవారిపాలెం తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో, పలు గ్రామాల్లో కూడళ్ల వద్ద ప్రత్యేక పందిళ్లలోనూ సీతారాముల కల్యాణం ఘనంగా జరిపారు. గంపలగూడెంలో శ్రీ రామనవమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో తిరునాళ్ల ఉత్సవం అట్టహాసంగా జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

- **మునునూరు:** మునునూరులోని వెంకటాచల స్వామి దేవస్థానం, తూర్పు, పడమర రామాలయాలతోపాటు, మండలంలోని వేల్పుచర్ల, గోపవరం, కాట్రేనిపాడు, గోగులంపాడు, రమణక్కపేట, చెక్కపల్లి, లోపూడి, బాసవరప్పాడు, గుడిపాడు, తదితర గ్రామాలలోని రామాలయాల వద్ద కల్యాణాన్ని నిర్వహించారు.
- **పైడూరుపాడు(విజయవాడరూరల్):** పైడూరుపాడు గ్రామంలోని పురాతన ఆలయం సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఉభయ దాతలుగా బోయినపల్లి రంగారావు దంపతులు పీటలపై కూర్చున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. సర్పంచి వి.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



కొండపల్లి ఇందిరా కాలనీలో సీతారామ స్వామి కల్యాణోత్సవం



సీతారాంపురంలో స్వామివార్ల కల్యాణం



తిరువూరు కోదండ రామాలయంలో సీతారామ కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



నూజివీడు ఎన్నెస్పీ కాలనీలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



చనుబండలో సీతారాముల కల్యాణం

నామినేషన్లకు అభ్యర్థులు సన్నద్ధం



- నేడు ఎన్నికల నోటిఫికేషన్
- వైఎస్సార్ సీపీ నుంచి రెండవసారి బీసీ అభ్యర్థి
- వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బరిలో సామాన్యుడు తిరుపతిరావు
- పార్టీ మారి టీడీపీ అభ్యర్థిగా వసంత



వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు



టీడీపీ కూటమి అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

1955లో నియోజకవర్గ ఓటర్లు	52,031
ప్రస్తుతం మొత్తం ఓటర్లు	2,80,754
మహిళలు	1,44,425
పురుషులు	1,36,310
ఇతరులు	19

మైలవరం నియోజకవర్గంలో మండలాలు, పోలింగ్ బూత్‌లు

మండలం	పోలింగ్ బూత్‌లు
మైలవరం	57
జి.కొండూరు	51
ఇబ్రహీంపట్నం	87
రెడ్డిగూడెం	48
విజయవాడ రూరల్	52

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది. సంపన్నులకు కంచుకోటగా పేరుగాంచిన మైలవరం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన అతి సామాన్యుడు సర్నాల తిరుపతిరావు బరిలో ఉన్నారు. ఆరున్నర దశాబ్దాలుగా ఒకే సామాజిక వర్గానికి కంచుకోటగా మారిన ఈ నియోజకవర్గంలో రెండవసారి బీసీ సామాజిక వర్గానికే పెద్దపీట వేస్తూ అధికార వైఎస్సార్ సీపీ ప్రత్యర్థులకు సవాలు విసిరింది. నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ బూత్‌లు 288, గ్రామాలు 65, పంచాయతీలు 61, వార్డులు 661 ఉన్నాయి.

పార్టీకి, నియోజకవర్గ ప్రజలకు వసంత వెన్నుపోటు

వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది ఐదేళ్లు పదవిని అనుభవించిన అనంతరం పార్టీకి, నియోజకవర్గ ప్రజలకు వెన్నుపోటు పొడిచి టీడీపీలో చేరి మరలా మైలవరం నియోజకవర్గానికే ఎమ్మెల్యే అభ్యర్థిగా వసంత వెంకటకృష్ణప్రసాద్ టీడీపీ నుంచి బరిలోకి దిగుతున్నారు. ఇప్పటికే ఇటు అధికార వైఎస్సార్ సీపీ అటు టీడీపీ కూటమి అభ్యర్థులు నోటిఫికేషన్ రాగానే నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతుండగా వీరితో పాటు ఒకరిద్దరు స్వతంత్ర అభ్యర్థులు సైతం తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

సామాన్యుడికి వైఎస్సార్ సీపీ సీటు

ఇదిలా ఉంటే అధికార వైఎస్సార్ సీపీ నుంచి నిరుపేద కుటుంబానికి చెందిన సర్నాల తిరుపతిరావు ఒక వైపు, నమ్మిన పార్టీని, ఓట్లేసి గెలిపించిన ప్రజలను మోసం చేసి టీడీపీ నుంచి బరిలోకి దిగుతున్న వసంత వెంకటకృష్ణప్రసాద్ మరోవైపు ఉన్న క్రమంలో నియోజకవర్గ ప్రజల తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మైనార్టీల అభ్యున్నతికి జగనన్నే సీఎం కావాలి

సర్నాల తిరుపతిరావు



ఎన్నికల ప్రచారం చేస్తున్న తిరుపతిరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముస్లిం మైనార్టీలు మరింత అభివృద్ధి సాధించాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. గొల్లపూడి పంచాయతీ మౌలానగర్‌లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ముస్లిం మైనార్టీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగేందుకు జగనన్న కృషి చేశారని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో ముస్లిం మైనార్టీలకు కల్పించిన 4 శాతం రిజర్వేషన్‌ను ఎత్తివేస్తామనే మతతత్వ పార్టీ బీజేపీతో టీడీపీ, జనసేన పార్టీ కూటమి పెట్టుకున్న పొత్తులను రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్

తిరువూరు: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైందని, ప్రతి ఓటరూ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తిరువూరు తహసీల్దార్ ప్రకాష్‌బాబు అన్నారు. ఓటర్లకు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ స్వీప్ కార్యక్రమాన్ని స్థానిక చీరాల సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. బుర్ర కథా కళాకారులు సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వయోజనులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, తమకు కావలసిన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని సూచించారు. నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు, ఎన్నికల డీటీ నాగమణి పాల్గొన్నారు.

నెమలిలో వైభవంగా విగ్రహ ఆవిర్భావ దినోత్సవం



ప్రత్యేక అలంకరణలో నెమలి వేణుగోపాలుడు

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 1952లో శ్రీరామ నవమి రోజు స్వామి భూమి నుంచి ఆవిర్భవించి భక్తులకు దర్శనం ఇచ్చారు. దీంతో ప్రతి ఏటా విగ్రహ ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తారు. తెల్లవారు ఝామున సుప్రభాత సేవతో ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చక బృందంచే ప్రారంభించారు. స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలు, నవఫల రసాలతో అభిషేకం కనులవిందుగా జరిపారు. అనంతరం నూతన వస్త్రాలు, సువర్ణాభరణాలు, వివిధ రకాల పూలమాలలతో అలంకరణ చేయగా భక్తులు స్వామిని దర్శించుకొని తరించారు. మధ్యాహ్నం రాజ్యలక్ష్మీదేవి సామూహిక కుంకుమార్చన చేశారు. సంప్రదాయబద్ధంగా తొమ్మిది రకాల ప్రత్యేక ప్రసాదాలను తయారుచేసి స్వామికి నివేదన సమర్పించారు. అనంతరం వాటిని భక్తులకు వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

తిరువూరు: సార్వత్రిక ఎన్నికల్లో తొలి ఘట్టం గురువారం ప్రారంభం కానుంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసేందుకు తిరువూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయమైన రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. ఆర్డీఓ కె. మాధవి రిటర్నింగ్ అధికారి హోదాలో నామినేషన్లు స్వీకరిస్తారు. అభ్యర్థులు నామినేషన్ల దాఖలు సమయంలో పాటించాల్సిన నిబంధనలు, అవసరమైన డాక్యుమెంట్లు, డిపాజిట్ చెల్లింపు వివరాలను తెలియజేస్తూ ఇటీవల రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ నెల 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణకు గడువు ఉంటుంది.

74 ఏళ్లుగా నామినేషన్లు అక్కడే..

నియోజకవర్గం 1952లో ఏర్పడగా, నాటినుంచి సహాయ రిటర్నింగ్ అధికారి కార్యాలయంగా ఉన్న తిరువూరు తహసీల్దార్ కార్యాలయంలోనే ఎన్నికల ప్రక్రియ నిర్వహించేవారు. అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియతో పాటు ఎన్నికలకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు ఇక్కడే జరిగాయి. డెప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి తిరువూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా ఉండేవారు. 2022లో తిరువూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటవడంతో ఇకపై రిటర్నింగ్ అధికారిగా ఆర్డీఓనే వ్యవహరిస్తుండగా, ఎన్నికల ప్రక్రియ కూడా అక్కడే నిర్వహిస్తారు.